నేడు 'నిథమ్'లో ప్రపంచ పర్యాటక దినోత్సవం

పాల్గొననున్న సీఎం, పర్యాటకశాఖ మంత్రి

రాయదుర్గం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిథమ్ పర్యవేక్షణలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. నిథమ్ ప్రాంగణంలో యోగా ప్రదర్శన, ఫుడ్ ఫెస్టివల్, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్టస్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పెద్ద కంజర్ల గ్రామ సమీపంలోని తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల (పురుషుల) లో 2024–25 సంవత్సరానికి బీఎస్సీ (ఎంపీసీ, ఎంఎస్సీఎస్ , ఎంఎస్డీఎస్, బీజెడ్సీ, బీకాం (సీఏ), (హానర్స్) గ్రూపులలో ప్రవేశాలకు విద్యార్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి రీజనల్ కోఆర్డినేటర్ సుధాకర్, ప్రిన్సిపాల్ మహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలను కళాశాలలో అందజేయాలన్నారు.ఎంపికైన విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి, భోజనం , నోట్ బుక్స్ ,బెడ్స్, దుస్తులు మొదలైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.మరిన్ని వివరాలకు సెల్ 9494824692, 9705992496, 8008070959లలో సంప్రదించాలన్నారు.

ట్రిపుల్‌ఐటీలో వాటర్ నెట్‌వర్క్ డిజిటల్ ట్విన్ ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్, జెడ్‌ఎఫ్ టెక్నాలజీస్ సంస్థ సహకారంతో వాటర్ యుటిలిటీ నెట్‌వర్క్ కోసం వినూత్న డిజిటల్ ట్విన్‌ను ప్రారంభించినట్లు గురువారం ప్రకటించారు. 5 నెలల క్రితం సీఎస్ఆర్ కింద నిర్ణయించిన మేరకు ప్రస్తుతం స్మార్ట్ సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్‌లో గణనీయమైన పురోగతి సాధించడంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ నోడ్‌లు (నీటి నాణ్యత, నీటి ప్రవాహం, నీటి స్థాయి, మోటారు నియంత్రణ) అమలు చేయబడ్డాయి. ఈ సందర్భంగా చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వాటర్(వాటర్ సీఓఈ) ఏర్పాటు కోసం ఒక ఒప్పందం కుదుర్చుకోవడంతో డిజిటల్ ట్విన్‌ను నిర్మించాలనే ఆలోచన వచ్చిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దీపక్ గంగాధరన్, డాక్టర్ కార్తీక్ వైద్యనాథన్ పాల్గొన్నారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులు ఏడుగురికి సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాను సందర్శిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి తదితరులు

చందానగర్: నిరుద్యోగ యువత కోసం జీహెచ్ఎంసీ సహకారంతో చందానగర్‌లోని లైట్ హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాను చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి సందర్శించారు. లైట్ హౌస్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జాబ్ మేళాలో నగరంలో 26 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. సుమారు 500 మంది ఈ జాబ్ మేళాలో పాల్గొని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ ప్రాజెక్టు అధికారి ఉషా, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ.. నీటి వృథా



సాయినగర్ వెస్ట్ ప్రాంతంలో రోడ్డుపై పారుతున్న మంచినీరు

కూకట్‌పల్లి: ఆల్విన్ కాలనీ డివిజన్ సాయినగర్ వెస్ట్ ప్రాంతంలో మంచినీటి పైపులైన్ లీకేజీతో మంచినీరు రోడ్లపాలవుతున్నాయి. మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు లీకేజీలకు మరమ్మతులు చేపట్టకపోవటంతో నీటి సరఫరా సమయంలో నీరు భారీగా రోడ్లపై పారుతోంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: గచ్చిబౌలి డివిజన్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ప్రాంగణంలో నవంబర్ 9, 10 తేదీల్లో జరుగబోయే 11వ నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సమావేశ బ్రోచర్‌ను గురువారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ఎస్‌వీ బద్రీనాథ్, వీవీరావు, ఈశ్వరి, రామారావు, ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

కృషినగర్ కాలనీ వద్ద రోడ్డుపై భారీ గుంతలు

- రాకపోకలకు ఇబ్బందులుపడుతున్న వాహనదారులు
- రోడ్ల దుస్థితిపై స్థానికుల ఆగ్రహం



మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో కృషినగర్ వద్ద రోడ్డు దుస్థితి



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

మియాపూర్: అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రధాన రోడ్లను తవ్వి రోజుల తరబడి అలాగే వదిలేయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం, అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. రోడ్లను తవ్వి పనులు చేయకుండా వదిలేయడంతో గుంతలమయంగా మారాయి.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో కృషినగర్ కాలనీ వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం 15 రోజుల కిందట తవ్వారు. వాహనాల రాకపోకలతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డు వెంబడి ప్రయాణం నరకప్రాయంగా మారింది.
- రోడ్డు వెంబడి వాహనాల రాకపోకలకు మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసమయ్యాయి. దీంతో మూతలు లేకుండా ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలం కావడంతో వర్షాలు పడినపుడు గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని భయాందోళన చెందుతున్నారు. రోడ్డు వెంబడి మోకాలి లోతు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అదుపుతప్పి కొందపడి గాయాలపాలవుతున్నారు.
- బాచుపల్లి, బొల్లారం వైపు వెళ్లే ప్రయాణికులు జాతీయ రహదారిలో వెళ్లాలంటే సిగ్నల్స్, ట్రాఫిక్‌తో ఇబ్బందవుతుందని, ఈ రోడ్డు వెంబడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు నుండి ప్రశాంత్‌నగర్, జేపీఎన్‌నగర్ మీదుగా బొల్లారం రోడ్డుకు వెళ్తుంటారు. కృషినగర్ దగ్గర రోడ్డును తవ్వడంతో గుంతలు పడ్డాయి. ఈ ప్రాంతంలో వాహనాలు నిలిచిపోతూ ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారు.
- దీప్తిశ్రీనగర్ నుండి ఎంఎనగర్ వెళ్లే రోడ్డులో శాంతినగర్ వద్ద వారం కిందట రోడ్డు కుంగిపోయింది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పగిలింది. దీంతో గత వారం రోజుల నుండి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డు గుంతలు పడడం, దీప్తిశ్రీనగర్ రోడ్డులో రాకపోకలు ఆగిపోవడంతో చందానగర్ నుండి బాచుపల్లి, బొల్లారం వైపు వెళ్లే వాహనాదారులు జాతీయ రహదారి వెంబడి వెళ్లాల్సి వస్తుంది. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ కారణంగా సమయానికి విధులకు వెళ్లలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన సీసీ రోడ్డు పనులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.







నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తగూడ ఫీడర్ పరిధిలోని సబర్ మిడోస్ విల్లాస్, మసీద్‌బండ విలేజ్, కేమ్‌లేట్ లేఅవుట్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్రీరాంనగర్ మెయిన్ రోడ్డు, శ్రీరాంనగర్ ఏ బ్లాక్, కొండాపూర్ ఏరియా హాస్పిటల్, చిరాగ్ స్కూల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు నిధి ఆప్కే నిఖత్ 2.0

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ఈ నెల 27న నిధి ఆప్కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...3 కేంద్రాల్లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారం క్రోమో లేబరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, టైచే డైకాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అదేవిధంగా సదాశివపేట పరిధిలోని వోల్వా గ్రీన్ స్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ మూడు కేంద్రాల్లో భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

29న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'మాన్యువల్ ఆఫ్ లైఫ్' అనే అంశంపై మౌంట్ అబూ స్పార్క్ వింగ్ కోఆర్డినేటర్ బికె సంజయ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

వై-సన్ చాలెంజ్ విజేతలకు అవార్డుల ప్రదానం



ట్రిపుల్‌ఐటీలో వై సన్ చాలెంజ్‌లో మొదటి స్థానంలో నిలిచిన జట్టు సభ్యులకు నగదు పురస్కారం అందిస్తున్న దృశ్యం

రాయదుర్గం: పట్టణ జీవనాన్ని మెరుగుపర్చడమే లక్ష్యంగా స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్, సిలికాన్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో వై-సన్ చాలెంజ్ నిర్వహించారు. ఈ చాలెంజ్‌లో విజేతల జట్లకు గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో గురువారం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. విజేతలుగా టాప్-త్రీలో నిలిచిన వారికి నగదు పురస్కారాలు అందజేశారు. మొత్తం 266 జట్ల నుంచి దరఖాస్తులు రాగా అందులో పది జట్లను ఫైనల్‌కు ఎంపిక చేశారు. ఏపీలోని విజయవాడకు చెందిన 'టీమ్ డీబీఆర్ ఇన్నోవేటివ్' సహా ఆరు ఎస్ఎంఈలు, విద్యార్థుల జట్లు నాలుగు ఎంపిక అయ్యాయి. అందులో టాప్-3లో నిలిచిన వాటిలో మొదటిస్థానం డీబీఆర్ ఇన్నోవేటివ్ టెక్ సంస్థకు రూ.5 లక్షల నగదు పురస్కారం, రెండవ స్థానం హోరస్ సంస్థకు రాగా రూ. 2 లక్షల నగదు పురస్కారం, మూడోస్థానంలో నిలిచిన యంత్రం ఎల్కట్రానిక్స్‌కు రూ.లక్ష నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా సిలికాన్ ల్యాబ్స్ ప్రతినిధి శ్రీనివాస దుక్కిపాటి మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రిపుల్‌ఐటీ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం మాట్లాడుతూ ఈ చాలెంజ్ సృజనాత్మకంగా ఆలోచించేలా ప్రేరేపించడమే కాకుండా ఆలోచనలకు జీవం పోసే సాధనాలు, వనరులను అందించిందన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ డాక్టర్ ఆఫ్తాబ్ హుస్సేన్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

మియాపూర్: మియాపూర్‌లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్, మియాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గం ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్ హాజరై సభ్యత్వ నమోదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి సభ్యత్వ నమోదు రికార్డుస్థాయిలో చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షులు నాగులుగౌడ్, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు మాణిక్‌రావు, నాయకులు లక్ష్మణ్, సురేష్, గణేష్, శ్రీనివాస్,రాము, సీతారాం నాయక్ పాల్గొన్నారు.

డబ్ల్యూటీఎస్ఏ-2024కు భారత్ ఆతిథ్యం

ట్రిపుల్‌ఐటీలో సన్నాహక సమావేశం

రాయదుర్గం: ప్రపంచ టెలికామ్ స్టాండరైజేషన్ అసెంబ్లీ(డబ్ల్యూటీఎస్ఏ-2024)కి భారత దేశం ఆతిథ్యం ఇవ్వడానికి సన్నద్ధమవుతోంది. అందులో భాగంగా ఢిల్లీ , హైదరాబాద్, బెంగళూరులలో కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ శాఖ విద్యార్థుల కోసం ఔట్‌రీచ్‌ని ప్రారంభించింది. ఇందులో టెలికామ్ పరిశ్రమ, విద్యారంగానికి చెందిన ప్రముఖ నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఢిల్లీ, బెంగళూరుతోపాటు గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీలో ఒకేసారి మూడుచోట్ల ఈ సన్నాహక సమావేశాలు నిర్వహించడం విశేషం. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆన్‌లైన్‌లో పాల్గొనడం విశేషం. ఆన్‌లైన్ సమావేశంలో నేషనల్ కమ్యూనికేషన్ అకాడమీ డైరెక్టర్ జనరల్ దేబ్‌కుమార్ చక్రవర్తి, ఆర్ఆర్ మిట్టర్, డీటీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రతీక్‌శర్మ, ప్రముఖులు అతుల్‌సిన్హా, రాజేష్ గుప్తా, అవినాష్‌అగర్వాల్, అధికార ప్రతినిధి హేమేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత, కంటి పరీక్షలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ బాలానగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ బాలానగర్ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి త్రిభువన్, కోశాధికారి మల్లిఖార్జున్‌రెడ్డి, ట్రస్టీ ధనశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ మొగులమ్మ బస్తీకి చెందిన సంతోష్‌కుమార్‌కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ నిధులు లక్ష రూపాయలను గురువారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు.

పరామర్శ

మాదాపూర్: దేవావత్ సురేష్ నాయక్ అకాల మరణం పార్టీకి తీరని లోటు అని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం మాదాపూర్‌లో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సురేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పరామర్శించిన వారిలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ పాల్గొన్నారు.



సురేష్ కుటుంబంతో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మియాపూర్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... గురువారం మియాపూర్ పరిధి బాచుపల్లి రోడ్డులోని లక్కీ రెస్టారెంట్ సమీపంలో ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా వ్యక్తి అప్పటికే మరణించి ఉన్నాడు. అతని గురించి స్థానికంగా వివరాలు ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. ఈ వ్యక్తి సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. మృతుని వేషధారణను బట్టి యాచకుడిగా గుర్తించారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యక్తి వివరాలు తెలిస్తే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

చాకలి ఐలమ్మకు నివాళి

చందానగర్: చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం చందానగర్ సర్కిల్ 21లో ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ వీర వనిత అని అన్నారు. ఏఎంసీ విజయ్, ఏసీపీ నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి, సిబ్బంది

పటాన్‌చెరు డివిజన్ పరిధిలో..

పటాన్‌చెరు: గడీలపై గళమెత్తి, తెలంగాణ రాష్ట్రంలో భూ పోరాటానికి నాంది పలికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సాకి చెరువు కట్టపై త్వరలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు అఫ్జల్, రజక సంఘం అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వాకింగ్ చేస్తూ భవనంపై నుంచి పడి జర్నలిస్టు మృతి



ఆదినారాయణ (ఫైల్)

మియాపూర్: వాకింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి కిందపడి ఓ టీవీ జర్నలిస్టు తన్నీరు ఆదినారాయణ మృతి చెందాడు. మియాపూర్ ఎస్ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మదీనాగూడలోని వినాయక్‌నగర్ కాలనీ విల్స్‌ఆర్ ఫ్లైట్స్ అపార్ట్‌మెంట్‌లోని 504లో పాత్రికేయుడు తన్నీరు ఆదినారాయణ, భార్య రమాదేవి ఇద్దరు కుమారులతో నివసిస్తున్నారు. గురువారం ఉదయం ఆదినారాయణ 8.30 గంటలకు భవనంపైకి వెళ్లి వాకింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి ఐదో అంతస్తు నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి.ఆయనను సమీపంలోని శ్రీకర ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే (9.45) నిమిషాలకు ఆయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతుడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డిజిటల్ వీక్షకుల సంఖ్య పెరుగుతోంది

భారత్ సమాచార్ ఎడిటర్ ఇన్ చీఫ్ బ్రజేష్‌మిశ్రా

రాయదుర్గం: జర్నలిజం విప్లవాత్మక దశను దాటుతోందని యూపీలోని భారత్ సమాచార్ ఎడిటర్ ఇన్‌చీఫ్ బ్రజేష్‌మిశ్రా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మొబైల్ అండ్ డేటా జర్నలిజమ్ ..ఎంబ్రేసింగ్ ఇన్నోవేషన్ ఇన్ మీడియా' అంశంపై గురువారం వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నిక్‌తోపాటు కంటెంట్‌పై కూడా తెలివిగా పనిచేయాలన్నారు. వార్తాపత్రికలు, టీవీ న్యూస్ ఛానెల్‌ల వీక్షకుల సంఖ్య తగ్గుతోందని, డిజిటల్ వీక్షకుల సంఖ్య పెరుగుతోందన్నారు. మనూ వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ జర్నలిస్ట్ అయినందున ఆయన పేరిట 'మనూ' యూనివర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. బీబీసీ ,న్యూఢిల్లీ హిందీ ఎడిటర్ నితిన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రస్తుతం జర్నలిస్టుగా మనం సవాలుతో కూడిన దశలో ఉన్నామన్నారు. టీజీఎంఆర్‌ఈఐఎస్ అధ్యక్షుడు ఎండీ ఫహీమ్ ఖురేషి ప్రసంగించారు.